సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 30 । జూన్ । 2023



విహార విడిది.. మది సవ్వడులే

జిల్లాలోని తీరప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- 8లో..



వైభవంగా పాలంకేశ్వరుడి తీరునాళ్ల

నల్లమలలో వెలసిన పాలంక వీరభద్రస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36 /30

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామతీర్థంలో జడ్జిల పూజలు



రామతీర్థంలో పూజలు చేస్తున్న జడ్జిలు

చీమకుర్తి: ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి ఆర్.శివకుమార్, ఎక్సైజ్ కోర్టు జడ్జి ఆర్.వెంకటేశ్వరశర్మ గురువారం రామతీర్థంలోని శ్రీమోక్ష రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. స్వామివారి ఆశీర్వాదాలను స్వీకరించారు.

చికెన్, కోడిగుడ్ల సరఫరాకు టెండర్ల స్వీకరణ

చీమకుర్తి: జిల్లాలోని గురుకుల బాలుర పాఠశాలల్లోని విద్యార్థులకు చికెన్, కోడిగుడ్లను సరఫరా చేసేందుకు అర్హత కలిగిన వారి నుంచి టెండర్ ఫాంలను స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాలల కన్వీనర్, సంతనూతలపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.మెర్సీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను జూన్ నెల 30న సంతనూతలపాడు గురుకుల బాలుర పాఠశాలలో తీసుకొని జూలై 3వ తేదీ లోపు అందించాలన్నారు. అలా సమర్పించిన దరఖాస్తులను జూలై నెల 4న జేసీ ఆధ్వర్యంలో ఓపెన్ చేసి నెగోషియేషన్ పద్ధతిలో ఖరారు చేస్తామని ప్రిన్సిపాల్, కన్వీనర్ తెలిపారు.

నీటి వనరులపై కలెక్టర్‌తో చర్చ



కలెక్టర్‌తో సమావేశమైన జల్‌శక్తి అభియాన్ సెంట్రల్‌నోడల్ ఆఫీసర్ మనోజ్‌బాపన

ఒంగోలు అర్బన్: మూడు రోజులుగా జిల్లాలో పర్యటించిన జల్ శక్తి అభియాన్ సెంట్రల్ అధికారి మనోజ్ బాపన ఆదివారం రాత్రి కలెక్టర్ దినేష్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి చర్చించారు. కంభం చెరువు లీకేజీ, వెలిగొండ ప్రాజెక్టు, గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పబ్లిక్ ట్యాప్‌లు, కొండపి హార్టికల్చర్, ఇంటింటి కుళాయి కనెక్షన్‌లు తదితర అంశాలపై చర్చించారు. దీనిలో టెక్నికల్ ఆఫీసర్ పీ యాదయ్య, డ్వామా పీడీ శ్రీనారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్ధన్ అలీ తదితరులు పాల్గొన్నారు.



తేనెటీగ..అమృతంలాంటి తేనె అందిస్తుంది. అది ఆరోగ్య ప్రదాయిని... సకల ఔషధాలు కలిగిన లక్షణాలు ఇందులో ఉన్నాయి..ఇది నాణేనికి ఒకవైపు..మానవాళి జీవన ప్రమాణాల్లో తేనెటీగల పాత్ర కీలకం..ఇవి రైతు నేస్తాలు కూడా.. తేనె ఉత్పత్తిలో 'రాణి'ఈగ ప్రధానం కాగా.. కూలి ఈగ, మగ ఈగలు తేనెపట్టులో సహాయకారిగా ఉంటాయి. ప్రస్తుతం వీటితో సంచార కేంద్రాలు ఏర్పాటు చేసి మకరందాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. జిల్లాలోని నాగులుప్పలపాడు మండలంలో సాగుచేస్తున్న పిల్లిపెసర పొలాల సమీపంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తేనెటీగలు ఉపకారిగా మారి చేస్తున్న మేలును తెలుసుకుందామా మరి..

తియ్యటి నేస్తాలు

- తేనెటీగల్లో "రాణి"దే కీలకం
- మగ, కూలీ ఈగలు కూడా
- పంటల కోసం సంచార జీవి తేనెటీగ పని
- పంటలను పండించటంతో పాటు తేనె లభ్యం
- అన్ని రకాల పూలు, పంటల నుంచి మకరందం స్వీకరణ
- హనీ మిషన్ ద్వారా ప్రోత్సాహం
- సంచార కేంద్రాల ఏర్పాటు

సాక్షిప్రతినిధి, ఒంగోలు: తేనెటీగలు ప్రకృతి వరప్రదాయని. మానవాళి జీవన ప్రమాణాల్లో వీటి పాత్ర అమోఘం. ప్రతి పంట పండటంలో ఇవి కీలక భూమిక పోషిస్తున్నాయంటే వీటి ప్రాముఖ్యత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు..పువ్వుల్లో కూడా ఆడపువ్వు, మగ పువ్వులు ఉంటాయి. పూలపై వాలి మకరందాన్ని సేకరించటం ద్వారా వాటికి పరపరాగ సంపర్కాన్ని కలిగించి పంట ఉత్పత్తుల దిగుబడికి దోహదపడటం వీటి ప్రధాన జీవన శైలిలో భాగం. పంటలు పూల దశలో ఉన్నప్పుడు మరికొన్ని జాతులు కూడా పరపరాగ సంపర్కానికి దోహదపడుతున్నాయి. తూనీగలు, సీతాకోక చిలుకలతో పాటు మరికొన్ని జీవులు ఉన్నా వాటన్నింటి కంటే తేనెటీగల పాత్రే కీలకం. దీంతో ఇవి రైతుకు మిత్రుడిగా మారాయి.

సంరక్షణ దిశగా..

గతంలో సహజ సిద్ధంగా తేనెటీగలు తేనె తుట్టెలను పెట్టడం ద్వారా మకరందాన్ని మానవాళికి అందిస్తూ వచ్చాయి. వాతావరణంలో వస్తున్న మార్పులు, కాలుష్యం, పురుగుమందుల అవశేషాలు...ఇవన్నీ వెరసి తేనెటీగలు అంతరించిపోతున్నాయి. దీంతో తేనెటీగలను పెంచి తేనె ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సంచార కేంద్రాలు ఏర్పాటు చేసి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సురక్షితమైన తేనెను అందిస్తున్నారు.



ఉప్పుగుండూరులో పొలాల వద్ద ఏర్పాటు చేసిన తేనె పెట్టెలు



పెట్టెల్లో నుంచి తేనె తుట్టెలను బయటకు తీస్తూ..



మిషన్ ద్వారా తేనె సేకరిస్తూ..



కానుగ తేనె..



బాక్సులో తేనెపట్టు

తేనెటీగల్లో "రారాణి"...

తేనెటీగల్లో ప్రధాన పాత్ర రాణి ఈగదే. జంతువుల్లో సింహాన్ని రారాజుగా అభివర్ణిస్తారు. అదేవిధంగా తేనెటీగల్లో రాణి ఈగను రారాణిగా అభివర్ణిస్తారు. సాధారణంగా మానవుల్లో అయినా, జంతు, పశు పక్షాదుల్లో మగ జాతికి ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. కానీ తేనెటీగల్లో రాణి ఈగ పాత్ర కీలకం. తేనెటీగల్లో మూడు రకాల ఈగలు ఉంటాయి. వాటిలో మొదటిది రాణి ఈగ అయితే, రెండోది మగ ఈగ. ఇక మూడోది కూలి ఈగ. మగ ఈగల పని రాణి ఈగతో సంపర్కం మాత్రమే. మగ ఈగ జీవిత కాలం 90 రోజులే ఉంటుంది. ఇక కూలి ఈగలు తేనె తుట్టెలను పెట్టడం, మకరందాన్ని సేకరించటం, పుప్పొడిని నిల్వ చేయటం అన్ని పనులు చేస్తాయి. వీటి జీవిత కాలం కేవలం 45 నుంచి 50 రోజులు మాత్రమే. ఇక రాణి ఈగ జీవిత కాలం మూడు నుంచి ఐదు సంవత్సరాలు. మగ ఈగలతో సంపర్కం తరువాత మూడు నుంచి ఐదేళ్ల వరకు గుడ్లు పెడుతూనే ఉంటుంది. రోజుకు 1500 నుంచి 2 వేల వరకు గుడ్లు పెట్టడమే దాని పని.

తేనెటీగలు సంచార జీవులు:

తేనెటీగలు తరచూ సంచరిస్తూనే ఉంటాయి. ఎందుకంటే పంటల సీజన్‌లను బట్టి ఎక్కడ ఏ పంటలు ఉంటే అక్కడకు వెళ్లి మకరందాన్ని తీసుకొని తేనె తుట్టెలు పెడుతుంటాయి. ఒక్కో ప్రాంతంలో ఒకటిన్నర నెల నుంచి రెండు నెలలపాటు ఉంటూ తేనెను ఉత్పత్తి చేస్తుంటాయి. పువ్వుల దశ పూర్తికాగానే మరో ప్రాంతానికి మరో రకం పంటల సాగు వైపునకు వెళుతుంటాయి. గతంలో అభయారణ్యాల్లో, అడవుల్లో అధికంగా తేనె తుట్టెలు ఏర్పాటు చేసుకొని తేనెను ఉత్పత్తి చేస్తూ వస్తున్నాయి.

30 రకాల తేనె ఉత్పత్తి...

రాష్ట్ర వ్యాప్తంగా పురుగు మందులు వాడకుండా పంటలు సాగు చేస్తున్న ప్రాంతాలను ఎంచుకొని మరీ తేనె ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ విధంగా 30 రకాల పంటల ద్వారా తేనె తీస్తున్నారు. వాటిలో ప్రధానంగా ఉద్యాన పంటల్లో ఇవి ఎక్కువ పాత్రను పోషిస్తున్నాయి. పొద్దు తిరుగుడు, నువ్వు, పిల్లి పెసర, ఆవాలు, ధనియాలు, జనుము, కుసుమ, ఒరిసెలు (అరకు ప్రాంతంలో), వేప, కానుగ, నువ్వులు (కర్నూలు), వాము (ఆదోని), ఆవాలు (నంద్యాల), రోడ్డు వెంట వేస్తున్న పూల రకాల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఎకరాకు రెండు నుంచి మూడు బాక్సులు ఏర్పాటు చేసి తేనెటీగలను సాకుతున్నారు. వాటి ద్వారా 25 నుంచి 30 రోజుల్లో మూడు నుంచి 5 కేజీల తేనె దిగుబడి వస్తోంది. తేనె తుట్టెలో పైన తేనె ఉంటుంది. కింద గుడ్ల అరలు ఉంటాయి. వాటి కింద పిల్లలు ఉంటాయి. వాటికి బాగా ఆహారం దొరికేకొద్దీ తేనెతుట్టె పెరుగుతుంది.



వివిధ రకాల తేనె బాటిళ్లు

పెరుగుతున్న ఉత్పత్తి కేంద్రాలు...

తేనె ఉత్పత్తి కేంద్రాలు రాను రాను పెరుగుతున్నాయి. **తేనె ఉత్పత్తి** కేంద్రాలు కొంత కాలం **వరకు కుటీర** పరిశ్రమ మాదిరిగా చేసుకుంటూ **జీవ**నం సాగిస్తున్నారు కొందరు. **మరికొం**దరు వ్యాపార దృక్పథంతో **తేనె** ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పి **పారిశ్రామికంగా** ఎదుగుతున్నారు. జిల్లాలోని ఉప్పుగుండూరు ప్రాంతంతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో తేనె ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశారు. తేనె ఉత్పత్తి కేంద్రాలను కూడా సీజనల్‌గా సాగు చేస్తున్న పంటల ప్రాంతాలకు వెళ్లిమరీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరిస్తూ తేనెను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రధానంగా పురుగు మందులు వాడని పంటల వద్ద వీటిని ఏర్పాటు చేసి తేనెను ఉత్పత్తి చేస్తున్నారు. ఉప్పుగుండూరులో వరి పంట తరువాత సాగు చేస్తున్న పిల్లి పెసర పంటల వద్ద ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

తేనెటీగల ఉత్పత్తికి ప్రభుత్వాల ప్రోత్సాహం



అంతరించిపోతున్న తేనెటీగల ఉత్పత్తికి, తద్వారా తేనెను ఉత్పత్తి చేయటానికి ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం హనీ మిషన్‌ను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తోంది. ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ ద్వారా అవగాహన కల్పించి రుణాలు కూడా అందిస్తున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా రుణాలు అందజేసి తేనె ఉత్పత్తి కేంద్రాలను ప్రోత్సహిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో నాబార్డు ద్వారా తేనె ఉత్పత్తి పెంపుపై అవగాహన కల్పిస్తున్నాం.

– కరవది కిశోర్‌కుమార్,
తేనెటీగల సాంకేతిక నిపుణుడు

గడప గడపకూ సమస్యలు తెలుసుకుంటూ...

- చట్టుతండాలో పర్యటించిన మంత్రి ఆదిమూలపు సురేష్




చట్టుతండాలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి సురేష్



గ్రావెల్ రహదారిని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా చేసిన అభివృద్ధిని వివరిస్తూ, గిరిజనుల సమస్యలు తెలుసుకుంటూ మండలంలోని సుద్దకురవతండా పంచాయతీ పరిధిలోని చట్టుతండా, మెట్టబోడు తండా, సుద్దకురవ తండాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్ గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగేళ్లలో పథకాల లబ్ధి ఏ మేరకు అందిందో అడిగి తెలుసుకున్నారు. ముందుగా గ్రామంలో ఈ నెల 26 వతేదీన ఇదే పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు గిరిజనులు మంచినీటి బోరు కావాలని అడగడంతో వెంటనే సొంత నిధులతో వేసిన బోరును గురువారం మంత్రి ప్రారంభించారు. గుట్టబోడుతండా నుంచి ఆర్ ఉమ్మడివరం చెరువు కట్ట వరకు రూ.10 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రహదారిని మంత్రి ప్రారంభించారు. గిరిజనులు పొలాలకు రహదారి లేదని, విద్యుత్ స్తంభాలు కావాలని, ఇంటి పట్టాలు కావాలని, పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకునిరావడంతో వెంటనే అధికారులను పిలిచి మంత్రి సమక్షంలోనే ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యను వెంటనే పరిష్కరించారు. దీంతో గిరిజనులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు తెలిపిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ఇది పేదల ప్రభుత్వం అని, పేదల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి అన్నారు. గ్రామాల్లోని ప్రజల వద్దకే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో గ్రామస్థాయిలోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో 98 శాతం జగనన్న నెరవేర్చారన్నారు. ఇప్పటి వరకు అమలైన పథకాల్లో అవినీతి దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని చెప్పారు. గతంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా సంక్షేమ పథకం కావాలన్నా అప్పటి జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి తీసుకునిరావాలని, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండలపార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వరనాయక్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, తహశీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఏవో నిర్మలాదేవి, ఎంఈవో లు శామ్యూల్‌జాన్, ఇందిర, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సందేశం ఇస్తున్న మత పెద్ద



ఒంగోలులో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగం..ప్రేమల ప్రతీక బక్రీద్

బక్రీద్ పర్వదినాన్ని జిల్లాలోని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దానధర్మాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

పొదిలి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- పొదిలి పెద్దచెరువు రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే
- పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం జగన్
- రూ.50.13 కోట్లతో దర్శి నుంచి పొదిలి చెరువుకు పైపులైన్



భూగర్భ పైపులైన్ నిర్మాణానికి పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: పొదిలి పట్టణ వాసుల చిరకాల స్వప్నం అతి త్వరలో నెరవేరబోతోంది. 40 ఏళ్ల నుంచి ప్రజలను ఊరిస్తూ వస్తున్న పొదిలి పెద్ద చెరువు సమ్మర్ స్టోరేజ్ సమస్యకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. దీంతో పొదిలికి తాగు, సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కానుంది. ఇందుకు రూ.50.13 కోట్లతో పొదిలికి మంజూరైన వాటరు రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను వేదపండితుల మంత్రోచ్చరణతో, ప్రజల హర్షధ్వానాల మధ్య మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి గురువారం ప్రారంభించారు. ముందుగా విశ్వనాథపురంలోని వైఎస్సార్ విగ్రహానికి పులమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు బాణ సంచా కాల్చుతూ, మేళతాళాలు, పూలతో ఇరిగేషన్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏప్రిల్ నెల 12వ తేదీ మార్కాపురంలో రెండో విడత ఈబీసీ నేస్తం సభలో ఆవిష్కరించిన శిలా ఫలకాన్ని చెరువు వద్ద ఏర్పాటు చేశారు. అనంతరం అక్కచెరువు రోడ్డులో ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ తన ప్రజా సంకల్ప పాదయాత్రలో పొదిలికి వచ్చినప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రూ.50.13 కోట్లతో దర్శి మండలంలోని కొత్తరెడ్డిపాలెం ఎన్‌ఎస్‌పీ కెనాల్ దగ్గర నుంచి భూగర్భ పైపులైన్ ద్వారా పొదిలి పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మార్చి నీరు నింపాలన్నారు. దీనికి నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి 220 ఎంసీఎఫ్‌టీ వాటరు ఓబీసీ చానల్ నుంచి పొదిలి పెద్ద చెరువుకు సరఫరా చేస్తారన్నారు. 6 నుంచి 9 నెలల్లోగా ప్రాజెక్టు పూర్తవుతుందని చెప్పారు. దీని వల్ల పొదిలి పట్టణంతో పాటు శివారు గ్రామాలకు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. ఈరోజు బక్రీద్, తొలి ఏకాదశితో పాటు మూడో పండుగ ఇక్కడ జరుపుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు.

కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈ కే లక్ష్మిరెడ్డి, ఏఈ రవికుమార్, కాంట్రాక్టర్ రఘు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, పొదిలి, కొనకనమిట్ల మండల, పట్టణ కన్వీనర్లు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కె నూర్జహాన్ బేగం, మోరా శంకర్‌రెడ్డి, మర్రిపూడి, కొనకనమిట్ల ఎంపీపీలు వాకా వెంకటరెడ్డి, ఎం మురళి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ కన్వీనర్ జీ శ్రీనివాసులు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మాజీ ఎంపీపీలు కే నరసింహారావు, ఉడుముల రాంనారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాయి రాజేశ్వరరావు, మాదాలవారిపాలెం సొసైటీ అధ్య క్షుడు కొత్తపులి బ్రహ్మారెడ్డి, నిర్మమహేశ్వర దేవస్థానం కమిటీ చైర్మన్ యక్కలి శేషగిరిరావు, నియోజకవర్గ వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కే సుబ్బారావు, ఉలవా గోపి, మోరా అంజిరెడ్డి, గూడూరి వినోద్, సర్పంచ్‌లు, సచివాలయ, గ్రామ, వార్డు, అనుబంధ కమిటీ కన్వీనర్లు, అధికారులు పాల్గొన్నారు.

అండర్ 19 క్రికెట్ పోటీల్లో ప్రకాశం జయభేరి

- సెంచరీలతో చెలరేగిన ఇద్దరు క్రీడాకారులు
- 80 పరుగుల ఆధిక్యంతో విజయకేతనం



ఎం.అభినవ్



జె.విష్ణుదత్తు

ఒంగోలు: అండర్ 19 క్రికెట్ పోటీల్లో ప్రకాశం జట్టు జయభేరి మోగించింది. నరసరావుపేటలో గురువారం కృష్ణా, ప్రకాశం జిల్లా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు అద్భుతంగా ఆడి భారీ లక్ష్యాన్ని కృష్ణా జిల్లా జట్టు ముందు ఉంచింది. ప్రకాశం జిల్లా జట్టులో ఎం.అభినవ్ 14 బౌండరీలు, 8 సిక్సర్లతో చెలరేగి 138 బంతుల్లో అజేయంగా 163 పరుగులు చేసి ఔరా అనిపించాడు. మరో వైపు జె.విష్ణుదత్తు 9 బౌండరీలు, 2 సిక్సర్ల సాయంతో 127 బంతుల్లో 104 పరుగులు చేసి రాణించాడు. దీంతో ప్రకాశం జట్టు నిర్ణీత 50 ఓవర్లు ముగిసేసరికి 3 వికెట్లు కోల్పోయి 314 పరుగులు చేసింది. అనంతరం 315 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కృష్ణా జిల్లా జట్టు 234/8 వద్ద కుప్పకూలింది. కేఎస్ఎన్ శ్రీనిశ్చయ్ 67 పరుగులు, కె.సాయివిష్ణువర్ధన్ 34 నాటౌట్‌లే అత్యధిక స్కోర్లు కావడం గమనార్హం. ప్రకాశం జట్టులో పి.దుర్గ బాలాజీ 32 పరుగులు ఇచ్చి 3 వికెట్లు, పార్థసారథి 50 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసి కృష్ణా జట్టు పతనానికి కారకులయ్యారు. దీంతో 80 పరుగుల ఆధిక్యంతో ప్రకాశం జట్టు జయభేరి మోగించింది.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

చీమకుర్తి: అమ్మ ఒడి డబ్బులను తల్లుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో జమచేయటంతో చంద్రపాడు గ్రామంలో లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పిల్లల చదువుల కోసం ఒక్కో తల్లి బ్యాంక్ ఖాతాలో రూ.15 వేలు జమ చేయటంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏలియా, వైఎస్సార్‌సీపీ నాయకులు వాకా సంజీవరెడ్డి, దుద్దుకూరి వెంకారెడ్డి, వైఎస్సార్ యూత్ అధ్యక్షుడు మోపూరి సుబ్బారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సహజానందస్వామిని దర్శించుకున్న కర్ణాటక డీజీపీ



స్వామిని దర్శించుకుంటున్న కర్ణాటక డీజీపీ ప్రతాప్‌రెడ్డి యామినిప్రియ దంపతులు

కొండపి: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పెట్లూరులో గురువారం నిర్వహించిన సహజానందస్వామి తిరునాళ్లకు కర్ణాటక అంతర్గత భద్రతా విభాగం డీజీపీ ప్రతాప్‌రెడ్డితో పాటు సతీమణి ఐపీఎస్ అధికారి యామినిప్రియ హాజరై స్వామి దర్శనం చేసుకున్నారు. దేవస్థానం పాలకవర్గం ఆధ్వర్యంలో పూజారులు ప్రతాప్‌రెడ్డి దంపతులకు ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. భక్తుల సందర్శనార్థం స్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. తిరునాళ్ల సందర్భంగా సాయంత్రం విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గుండ్లకమ్మలో పడి వ్యక్తి మృతి



గుండ్లకమ్మలో కనిపిస్తున్న మృతదేహం

మార్కాపురం: ప్రమాదవశాత్తూ గుండ్లకమ్మలో పడి వ్యక్తి మృతి చెందాడు. పట్టణ పోలీసుల కథనం ప్రకారం..కళాశాల రోడ్డులో నివాసముంటున్న పుప్పాళ్ల నాగయ్య కుమారుడు రాజేష్ ఖన్నా (24) మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. గత నాలుగైదు రోజులుగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించటం లేదని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో గురువారం ఉదయం దరిమడుగు సమీపంలో ఉన్న గుండ్లకమ్మ నదిలో మృతదేహం కనిపించింది. పోలీసులు గుండ్లకమ్మలో నుంచి మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఫిట్స్ వచ్చి పడిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై యువకుడు బ్లేడుతో దాడి

గిద్దలూరు రూరల్: ఉపాధ్యాయుడిపై యువకుడు బ్లేడుతో దాడి చేసి గాయపరచిన సంఘటన పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..సైకో మనస్తత్వం కలిగిన యువకుడు కొండారెడ్డి అనే ఉపాధ్యాయుడిపై బ్లేడుతో దాడి చేసి గాయపరిచాడు. దీంతో అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై దాసరి ప్రసాద్

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని ఏరువారిపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సీఎస్‌పురం మండలం పిల్లివారిపల్లికి చెందిన చలంచర్ల వెంకటేశ్వర్లు కుటుంబం, గత కొంతకాలంగా చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం సమీపంలోని నిప్పట్లపాడులో జీవనభృతి కోసం కట్టెలు కొట్టుకుంటూ జీవిస్తున్నారు. ఈక్రమంలో మండలంలోని ఏరువారిపల్లిలోని బంధువుల ఇంట్లో జరిగే పుష్పాలంకరణ వేడుకలకు మృతురాలు చలంచర్ల నాగలక్ష్మి(18), ఆమె అక్క మేకల అంజలి, బావ సువార్తయ్యలు బైక్ పై వచ్చారు. రాత్రి 2 గంటల సమయంలో తిరుగు ప్రయాణం చేస్తుండగా ఏరువారిపల్లి దాటిన తర్వాత బ్రిడ్జి మలుపు వద్ద బైక్ స్కిడ్ అయ్యి తిరగబడింది. ఈ దుర్ఘటనలో నాగలక్ష్మి తలకు బలమైన గాయాలు, కాగా అంజలి, సువార్తయ్యలకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా నాగలక్ష్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, అంజలి, సువార్తయ్యను మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి ప్రసాద్ పేర్కొన్నారు.

స్థల వివాదంలో 9 మందికి గాయాలు

దర్శి: పట్టణంలోని ఓ స్థలం వివాదంలో గురువారం రాత్రి కొట్లాట జరిగింది. దీంతో 9 మందికి గాయాలయ్యాయి. చెందిన ఇరు వర్గాలకు చెందిన ముస్లింలు బంధువులే. కాగా ఆస్థలం తమదంటే తమదని గత కొద్ది రోజులుగా భాగ పంపకాలపై వివాదం నెలకొంది. ఈక్రమంలో మజ్జువలి కుటుంబానికి చెందిన వర్గీయులు, రహమాన్ ఖాన్ కుటుంబానికి చెందిన వర్గీయులు పరస్పరం దాడులు చేసుకున్నారు. గాయాలు అయినవారిని దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై రామకృష్ణ ఆసుపత్రిలో క్షతగాత్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తీరానికి పర్యాటక హారం

విహార విడిది.. మది సవ్వడులే..



కొత్తపట్నం సముద్రతీరం

బీచ్‌ల పేరు వింటేనే చాలు మనసు గాలిలో తేలిపోతుంది. అలల సవ్వడి దగ్గరుండి చూడాలని మనసు ఆరాటపడుతుంది. వయ్యారంగా వచ్చిపోయే అలల మధ్య స్నానం చేస్తూ పొందే ఆనందం అంతా ఇంతా కాదు. చిన్నారుల దగ్గర నుంచి పెద్దవాళ్ల వరకు కేరింతలు కొడుతూ సంబర పడడం చూస్తే ఆహా అనిపిస్తుంది. కొద్దిపాటి సౌకర్యాలతోనే ఇంత ఎంజాయ్ చేస్తుంటే ఇక సాగర తీరం వెంబడి బీచ్‌లు, రిసార్ట్స్.. హోటళ్లు..మ్యూజికల్ నైట్స్.. బోట్ షికార్.. ఇలా సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైతే ఆకిక్కే వేరబ్బా. మన బీచ్‌లు కూడా పర్యాటకులను ఆకర్షించేలా ప్రభుత్వం దృష్టిసారించింది. ఆరోగ్యకరమైన, సురక్షితమైన వాతావరణాన్ని పెంపొందించి పర్యాటకులకు సమున్నతమైన ఆహ్లాదాన్ని పెంపొందించేలా చర్యలు చేపడుతోంది. జిల్లాలో నాలుగు ప్రాంతాలను గుర్తించింది. రానున్న రోజుల్లో వాటిని పర్యాటకానికి చిరునామా తీర్చిదిద్దనుంది.

– ఒంగోలు డెస్క్

- పర్యాటక కేంద్రాలుగా తీరప్రాంతాల అభివృద్ధి
- జిల్లాలోని 5 మండలాల్లో విస్తరించి ఉన్న తీరం
- 23 ప్రాంతాలను పరిశీలించిన ప్రత్యేక బృందం
- బీచ్‌ల అభివృద్ధి నివేదిక తయారీ
- జిల్లాలో తీరం పరిధిలో ఉన్న 5 మండలాలు
- బీచ్‌ల అభివృద్ధితో పర్యాటక రంగానికి కేరాఫ్‌గా జిల్లా

బీచ్‌లంటే టక్కున గుర్తువస్తాయి గోవా, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా సువిశాలమైన తీర ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. పర్యాటక రంగం అభివృద్ధితో విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జించటంతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా అడుగులు వేగంగా వేస్తోంది. సముద్ర తీరంలో బీచ్‌ల అభివృద్ధ్ అవసరమైన మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసింది. ఈ బృందం సభ్యులు 11 జిల్లాల్లో సుమారు 500 పైగా తీర ప్రాంతాలను పరిశీలించారు. తీరంలోని మత్స్యకారుల ఉనికికి ఎటువంటి ఇబ్బంది లేకుండా వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా బీచ్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మత్స్యశాఖ, పర్యాటక శాఖ అధికారులను బృందంలో సభ్యులుగా నియమించింది. పొరుగు రాష్ట్రాల్లో ఉన్న బీచ్‌లను పరిశీలిస్తూనే ఇక్కడ తీర ప్రాంతాలను అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టింది.

ఇవీ ప్రమాణాలు

సముద్రతీరంలో బీచ్‌లను ఏర్పాటు చేయాలంటే రాతినేల కాకుండా ఇసుక నేల ఉండాలి. బీచ్‌కు వచ్చే పర్యాటకులకు పూర్తి భద్రత ఉండాలి. అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి వీలు ఉండకూడదు. మడ అడవులు ఉండకూడదు. రవాణా సౌకర్యం కూడా ఉండాలి. జాతీయ రహదారికి సముద్రతీరం అతి దగ్గరగా ఉండాలి. వాస్తవానికి మడ అడవులు ఉన్న ప్రాంతాల్లో రొయ్యలు గుడ్లు పెట్టడానికి అవాసాలు చేసుకుంటాయి. అంతేకాక మడ అడవులను నిర్వీర్యం చేయడం చట్టరీత్యా నిషిద్ధం.

జిల్లాలో 23 ప్రాంతాల పరిశీలన

జిల్లాలోని సముద్రతీర ప్రాంతం బీచ్‌ల అభివృద్ధికి ఎంతో అనుకూలమని సర్వే బృందాలు నిర్ధారించాయి. జిల్లాలోని 5 మండలాల పరిధిలో తీరప్రాంతం విస్తరించి ఉండగా 23 బీచ్ ప్రాంతాలను ప్రత్యేక బృందాలు పరిశీలించాయి. జిల్లాలో సముద్రతీరం ఇసుకతో ఉంటుంది. రాళ్లు ఉండవు. మడ అడవులు కూడా లేవు. అన్ని ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని తీరప్రాంతాలను పరిశీలించాయి. జిల్లాలో నాగులుప్పలపాడు మండలంలో చిన్నమ్మగారిపట్టుపాలెం, మేకల సోమయ్యగారిపాలెం, వినోదరాయునిపాలెం, కనపర్తివారిపల్లెపాలెం, గోవిందరావుపాలెం, గుండాయపాలెం, చింతయ్యగారిపాలెం, కొత్తపట్నం మండలంలో గుండమాల, మోటుమాల, పిన్నివారిపాలెం, కొత్తపట్నం, గవండ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, రాజుపాలెం, ఈతముక్కల, టంగుటూరు మండలంలో మడనూరు, వైట్ శాండ్ బీచ్, మూసి రివర్ యూత్ బీచ్, తాళ్లపాలెం, సింగరాయకొండ మండలంలో పాకల, చెల్లెమ్మగారి పట్టపుపాలెం, పోతయ్యగారి పట్టపుపాలెం, ఊళ్లపాలెం బీచ్‌లను పరిశీలించారు.



పాకల బీచ్‌లో చేపట్టిన రోడ్డు నిర్మాణం, లైటింగ్ ఏర్పాట్లు

నాలుగు అనుకూలం

జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో ఉన్న 23 బీచ్‌లను పరిశీలించగా వాటిలో పాకల బీచ్‌లో మొదటి స్థానంలోను, కొత్తపట్నం రెండో స్థానంలో ఉన్నాయి. రవాణా పరంగా పాకల బీచ్ జాతీయ రహదారి నుంచి సుమారు 10 కిలోమీటర్లు, కొత్తపట్నం బీచ్ 18 కిలోమీటర్లు, ఈతముక్కల బీచ్ 10 కిలోమీటర్లు, మడనూరు బీచ్ 11 కిలోమీటర్లు ఉన్నాయి. సౌకర్యాల పరంగా చూస్తే పాకల, కొత్తపట్నం బీచ్‌ల వద్దకు నేరుగా పోయేందుకు రోడ్డు సౌకర్యం ఉండగా, ఈతముక్కల, మడనూరు బీచ్‌ల వద్దకు వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం సరిగా లేదు. ఈ రెండు బీచ్‌లకు కిలోమీటరు ఇవతల వరకు మాత్రమే రోడ్డు సౌకర్యం ఉండగా రోడ్డు నుంచి తీరం వరకు సుమారు కిలోమీటరు దూరం నడవాలి. అంతేకాక భద్రతా పరంగా ఆ రెండు ప్రాంతాలు అనుకూలం కాదని ప్రత్యేక బృందాలు తెలియజేస్తున్నాయి. పాకల బీచ్‌లో సువిశాలమైన సముద్ర ఉండగా తీరం వెంబడి రోడ్డు, లైటింగ్ ఏర్పాటు చేశారు. పర్యాటకుల కోసం హోటళ్లు, దుకాణాలు ఉన్నాయి. భద్రతకు అనుకూలం. రామాయపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ఔట్‌పోస్టు కూడా ఉంది. నిత్యం మెరైన్ పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తుంటారు. ఇటీవల పాకల తీరంలో బీచ్ అభివృద్ధికి కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో రెవెన్యూ శాఖ 15 ఎకరాలను పర్యాటక శాఖకు కేటాయించింది. గతంలో 5 ఎకరాల్లో రెస్టారెంట్ నిర్మాణం జరగగా సాంకేతిక కారణాల వలన రెస్టారెంట్ నిర్మాణం ఆగిపోయింది. దానిని తిరిగి ప్రారంభించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బీచ్‌ల అభివృద్ధిలో భాగంగా రిసార్ట్స్, హోటళ్లు, రోడ్లు, బోట్ షికారు, మ్యూజికల్ నైట్స్ వంటి సౌకర్యాలు కల్పించి పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

పాకల బెస్ట్



జిల్లాలో బీచ్‌ల అభివృద్ధి కోసం ప్రభుత్వం నియమించిన ప్రత్యేక సర్వే బృందంలో ప్రధాన సభ్యునిగా ఉన్నాను. జిల్లా పరిధిలో 23 బీచ్‌లను పరిశీలించాం. వాటిలో పాకల బీచ్ పర్యాటక రంగానికి అన్ని విధాలా అనుకూలంగా ఉంది. పాకల బీచ్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే పర్యాటకులకు ఎంతో ఉపయోగం.

– డీ రవీంద్రనాథ్ కుమార్ రెడ్డి, డీన్, కాలేజ్ ఆఫ్ ఫిషరీస్ సైన్సెస్, ముత్తుకూరు, నెల్లూరు జిల్లా

పర్యాటక రంగం అభివృద్ధి



జిల్లాలో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకోసం బీచ్‌లను ఏవిధంగా అభివృద్ధి చేయవచ్చో ప్రత్యేక బృందాలను నియమించింది. దీనికి తోడు పాకలలో రెవెన్యూ శాఖ 15 ఎకరాలను తీరం వద్ద టూరిజం శాఖకు కేటాయించింది.

– బెన్‌హర్, జిల్లా టూరిజం శాఖ అధికారి, ఒంగోలు

భద్రతకు ప్రాధాన్యం



జిల్లా పరిధిలో పాకల సముద్రతీరం ఎంతో అనుకూలం. ఇటీవల మెరైన్ పోలీసు ఔట్ పోస్టు కూడా ఏర్పాటు చేశాం. రిసార్ట్స్ నిర్మిస్తే పర్యాటకులు రాత్రి పూట బీచ్‌లో ఉండటానికి అవకాశం ఉంటుంది. యువతకు ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు గ్రామాభివృద్ధి జరుగుతుంది.

– ఆర్ఎస్ కిషోర్‌కుమార్, మెరైన్ సీఐ



కొత్తపట్నం అభివృద్ధి చేయనున్న రిసార్ట్ నమూనా

అంగరంగ వైభవంగా పాలంకేశ్వరుడి తిరునాళ్ల



పాలంకేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామికి తలనీలాలు అర్పిస్తున్న భక్తులు

యర్రగొండపాలెం: దట్టమైన నల్లమల అభయారణ్యంలో కృష్ణానది ఒడ్డున వెలసిన పాలంక వీరభద్రస్వామి తిరునాళ్ల తొలి ఏకాదశి సందర్భంగా గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. క్షేత్రంలో వెలసిన వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్ల దర్శనం కోసం ప్రకాశం, గుంటూరు, పల్నాడు, కృష్ణ, నంద్యాల జిల్లాలతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వేలాది మంది తరలి వచ్చారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి క్షేత్రంలో అహ్లాదాన్ని కలిగించే సెలయేటి వద్ద భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి స్నానాలు చేశారు. ప్రధానంగా స్వామి వారి దర్శనం అనంతరం భక్తులు సంతాన గద్దె వద్ద క్యూ కట్టారు. అక్కడ సంతానం కోసం దంపతులు తమ దోసిళ్లు పడితే పంచలింగాలపై నుంచి నీటి బిందువులు జారువారుతాయి. ఈ బిందువులు దోసిళ్లలో పడితే తమకు సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. పాలంక భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సీఐ కె.మారుతీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ బి.కోటయ్య పర్యవేక్షించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సంతాన గద్దె వద్ద నీటి బిందువులు పడుతున్న దంపతులు

ప్రతి గడపలో సంక్షేమ కాంతులు

● ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్



సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపలో నవరత్నాల పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. సీఎస్‌పురంలోని సచివాలయం–2 పరిధిలో, దర్శి తిమ్మక్కపల్లి, ముక్కపాడులలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందచేస్తున్నట్లు తెలిపారు. ఏపీలో అమలు చేస్తున్న అమ్మఒడి పథకం దేశంలో ఎక్కడా లేదన్నారు. రాష్ట్రంలో రూ.2 లక్షల కోట్లు సంక్షేమ పథకాల ద్వార నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అర్హతే ప్రమాణికంగా నేరుగా లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందచేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను లబ్ధిని వివరించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందచేశారు. తొలుత వీరాంజనేయులు, ఉత్తి బాలరత్తయ్య, ఎంపీటీసీ బత్తుల మాలకొండయ్య, తోటా రమేష్, దేవరాజ్, ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, సొరం రాజేష్, జడ్పీటీసీ మేకల శ్రీను, పాలకొల్లు వెంకటేశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీలు దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, భూమిరెడ్డి వెంకటరెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, శేఖర్, చింతం నారాయణ, బత్తుల కొండయ్య, రామిరెడ్డి, సంగిశెట్టి వాసు, ఎస్కే ఖాజా, కో ఆప్షన్ సభ్యుడు పఠాన్ బాబు, పెరుగు సుబ్బరామయ్య, భువనగిరి వెంటయ్యలు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దుగ్గిరెడ్డి జయరెడ్డి, మిరియం వెంకటేశ్వర్లు చౌదరి, బి.తిరుపతి రెడ్డి, జాన్ బాబు, ముత్యాల గురవయ్య, ఎస్కే బుజ్జీ, బీటీఆర్, జయమ్మ, జాజుల తిరుపాలు, అద్దంకి రమణయ్య, మల్లికార్జునరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎస్టీ కాలనీలో మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన దీప్ బోర్‌వెల్‌ను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రారంభించారు.